సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం | 5 | ఫిబ్రవరి | 2023



సర్టిఫికెట్లు, సర్వీస్ బుక్స్..
ఉపాధ్యాయుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ బుక్స్ పరిశీలన కార్యక్రమం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అబ్దుల్ హై పర్యవేక్షణలో చేపట్టారు. - 8లో



తొలిదశలోనే గుర్తించాలి
క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించినట్లయితే నివారించడానికి వీలవుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
33.0^{0} / 13.0^{0}

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి పూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరం ప్రవేశం పొందిన పీజీ మొదటి సెమిస్టర్ విద్యార్థులు పోటీ పరీక్షల ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు శనివారం తెలిపారు. ఎస్సై, కానిస్టేబుల్, గ్రూప్–1, 2, 3, 4 తదితర పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు ఈనెల 13వ తేదీలోపు సంబంధిత విభాగాల అధిపతుల సంతకంతో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కేయూలో పోటీ పరీక్షల శిక్షణ సంచాలకులు డాక్టర్ టి.నాగయ్యకు దరఖాస్తులు సమర్పించాలని, ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపస్‌లోని ఫిజిక్స్ విభాగంలో గల సెమినార్ హాల్‌లో తరగతులు ఉంటాయని తెలిపారు. దీనికి సంబంధించిన దరఖాస్తులను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన సింధు శర్మ



మామునూరు: మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ నూతన కమాండెంట్‌గా నియామకమైన సింధు శర్మ బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల ఎస్పీగా పనిచేసిన సింధు శర్మ బదిలీపై ఇక్కడికి వచ్చిన విషయం విదితమే. శనివారం ఆమె కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శివప్రసాద్‌రెడ్డి హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కాగా.. బాధ్యతలు స్వీకరించిన సింధు శర్మకు బదిలీపై వెళ్తున్న శివప్రసాద్‌రెడ్డి, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు నరేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాంబాబు, జయరాం, ఎంటీఓ నాగేశ్వర్‌రావు, వెల్ఫేర్ ఆఫీసర్ చంద్రన్న, దయాశీల, రాజ్‌కుమార్, అశోక్, ఏఓ కల్పనరెడ్డి, ఉద్యోగ సంఘాల అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమయ్య వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె గౌరవ వందనం స్వీకరించారు.

జోనల్ స్థాయి కబడ్డీ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శనివారం నిర్వహించిన హనుమకొండ జోనల్ స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. జోనల్ పరిధిలోని హనుమకొండ, కాజీపేట, ఐనవోలు మండలాల నుంచి 80 మంది క్రీడాకారులు హాజరైనట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి అక్రం ఖాన్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 8న జేఎన్ఎస్‌లో జరగనున్న వజీర్ ఖాన్ మెమోరియల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. పురుషుల విభాగంలో నిర్వహించనున్న టోర్నమెంట్‌లో హసన్‌పర్తి, పరకాల, వేలేరు, భీమదేవరపల్లి, హనుమకొండ జోన్లకు చెందిన క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, కోశాధికారి సీహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు 'బార్' కార్యవర్గాలకు తీర్మానం
వరంగల్ లీగల్: హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వేర్వేరుగా బార్ అసోసియేషన్ల ఏర్పాటుకు ఏకగ్రీవంగా తీర్మానించి రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు పంపించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఏ.ఆనంద్‌మోహన్, శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం బార్ అసోసియేషన్ భవనంలో ఆనంద్‌మోహన్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. జనవరి 23న సుమారు 270 మంది న్యాయవాదులు అందజేసిన విజ్ఞాపన పత్రాన్ని కార్యవర్గం చర్చకు స్వీకరించింది. హైకోర్టు ఆదేశాల మేరకు గత ఏడాది జూన్ 2న హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వేర్వేరుగా జిల్లా కోర్టులు ఏర్పాటు చేయడం, ఒకే ప్రాంగణంలో విడివిడిగా పరిపాలన కొనసాగుతున్న దృష్ట్యా బార్ అసోసియేషన్లు కూడా వేర్వేరుగా ఉండటం న్యాయ సమ్మతమని న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని బార్ అసోసియేషన్ స్వీకరించింది. మేరకు తీర్మాన పత్రాలను బార్ కౌన్సిల్‌కు పంపించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

"'మీ మీద బాగా ఫిర్యాదులు వస్తున్నయ్.. భూముల దందా వ్యవహారం నేనే చూస్తున్నా.. కేయూ, హసన్‌పర్తి ఠాణాల పరిధిలో ఆరోపణలున్నాయి. జాగ్రత్తగా వ్యవహరించండి.. చట్టవిరుద్ధంగా భూ దందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడితే చర్యలు ఉంటాయి..' ఓ మాజీ కార్పొరేటర్, కార్పొరేటర్ భర్తకు ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఓ పోలీసు అధికారి వార్నింగ్.

ఆమె ఓ మహిళా కార్పొరేటర్. తాతలు, తండ్రుల కాలంలో భూములు బాగానే ఉన్నా.. పదేళ్ల కిందటే చాలా వరకు అమ్మేశారు. కుటుంబ సభ్యులు కొందరు అమెరికాలో స్థిరపడ్డారు. ఇప్పుడు ఆ భూముల రేట్లు కాస్త చుక్కలనంటడంతో ఆ భూములు తమవేనంటూ కార్పొరేటర్ రివర్స్ అయ్యారు. దీంతో చేసేదేమీ లేక బాధితులు సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ వివాదంలో పడ్డారు.

జగడాలు.. ఆగడాలు!



సాక్షిప్రతినిధి, వరంగల్:

ఇదీ 'గ్రేటర్'లో కొందరు కార్పొరేటర్ల తీరు
- వివాదాస్పదంగా మరికొందరు కార్పొరేటర్ల భర్తలు
- ఆక్రమణలు, సెటిల్‌మెంట్లతో వివాదాస్పదం
- పోలీసులు కేసులు పెడుతున్నా మారని వైనం

...గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)లో కొందరు కార్పొరేటర్ల ఇష్టారాజ్యం నడుస్తోంది. చాలా మంది తమ డివిజన్లు కాకుండా పాలన అంతా తమదే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. భూ కబ్జాలకు పాల్పడటం, అక్రమంగా పత్రాలను పొందడంతోపాటు బల్దియా సిబ్బందిని బెదిరింపులకు గురిచేస్తున్నా కట్టడి చేసేవారు లేక అధికారులు హడలి పోతున్నారు. తాజాగా ఇద్దరు కార్పొరేటర్లు భూ దందాలు, ఆక్రమణలు, సెటిల్‌మెంట్ల ఆరోపణలు, ఫిర్యాదులపై పోలీసు కేసుల్లో ఇరుక్కోవడం చర్చనీయాంశమైంది. అయినప్పటికీ కొందరు 'భవనం నిర్మిస్తే కప్పం కట్టాలి.. అభివృద్ధి పనులకు కమీషన్లు చెల్లించాలి.. కాంట్రాక్టులు ఇవ్వాలి' అని అంటున్నారు.

సంఘటనలు అనేకం.. మచ్చుకు కొన్ని..

ఆయనో మాజీ కార్పొరేటర్.. ప్రస్తుతం కార్పొరేటర్ భర్త. విలీన గ్రామాల్లో భూ దందాలు, రియల్ ఎస్టేట్‌కు శ్రీకారం చుట్టిన సదరు వ్యక్తి.. ఖాళీ జాగాలో ఖర్చీఫ్ వేసేందుకు ముందుగా అతడి తమ్ముళ్ని రంగంలోకి దింపుతారు. బాధితులు తెరమీదకు రాగానే నేరుగా రంగప్రవేశం చేసి సెటిల్‌మెంట్ కోసం ఒత్తిడి చేసి పని కానిచ్చేస్తాడు. దేవన్నపేట, కోమటిపల్లి తదితర ప్రాంతాల్లో ఇలాంటివి అనేకం. గతంలో టీచర్.. ఇప్పుడు ఎస్ఐగా ఉన్న ఒకరి భూమిని సైతం కబ్జా చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

- హనుమకొండ ప్రాంతంలోని ఓ కార్పొరేటర్ భర్త ఆయన. వాళ్ల భూమి, వీళ్ల భూమి కాదు.. ఏకంగా ఓ చెరువులోనే కాలు మోపాడు. అధికారం తోడై అడిగే వాడు లేకుంటే ఆక్రమణలకు అడ్డూ అదుపూ ఉండదన్నదానికి ఉదాహరణే ఈ ఘటన. భీమారం ప్రాంతంలో ఆక్రమణలకు సంబంధం ఉందన్న ఆరోపణలు అతడిపై ఉన్నాయి.
- ఓ కీలక ప్రజాప్రతినిధికి ముఖ్య అనుచరుడైన వరంగల్ ప్రాంతానికి చెందిన ఓ కార్పొరేటర్ వివాదాస్పద భూముల సెటిల్‌మెంట్లలో దిట్టగా వ్యవహరిస్తున్నారనే పేరుంది. ఇదే ప్రాంతంలోని ఓ కార్పొరేటర్ భర్త ప్రతీదానికి వసూళ్లే లక్ష్యంగా పెట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కార్పొరేటర్ భర్తకు నోటి దురుసు కూడా ఎక్కువే అంటారు.
- వరంగల్ ఏరియాలోనే మరో కార్పొరేటర్ 'జోష్' పెంచి ఏకంగా కార్పొరేషన్ స్థలానికి ఎసరు పెట్టడం వివాదాస్పదమైంది. జీడబ్ల్యూఎంసీ లే అవుట్ స్థలానికి ఇంటి నంబర్ తీసుకుని విలువైన స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశారు.
- గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధికి అనుచరుడు, కార్పొరేటర్ భర్త భూ వివాదాల్లో చిక్కుకున్నారు. ఎదుటివారి భూముల్లో ఖర్చీఫ్ వేసి వారిని 'శివ శివ' అనిపించడమే అతని పనిగా చెబుతున్నారు. వివాదాస్పద భూముల పేరిట దందాలకు పాల్పడుతున్నారంటూ అతనిపై ఫిర్యాదుల వరకు వెళ్లింది.
- హనుమకొండ నగర శివారులో గోపాలపూర్, కోమటిపల్లి తదితర ఏరియాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు, అక్రమ రవాణా నడుస్తోంది. హనుమకొండలో ఓ డివిజన్‌కు చెందిన ఓ కార్పొరేటర్ తనకు అండగా ఉన్న నేత పేరు, పలుకుబడిని వాడుకుంటూ అధికారుల్ని దగ్గరకు రాకుండా చూసుకుంటున్నాడన్న ప్రచారం ఉంది.

...ఇలా వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రై సిటీస్‌లో పలువురు కార్పొరేటర్లు, కార్పొరేటర్ల భర్తలు, వారి అనుచరులు చేస్తున్న ఈ తరహా దందాలతో నగరవాసులు పోలీసులకు ఆశ్రయిస్తున్నారు.

రంగంలోకి ఇంటెలిజెన్స్, ఎస్బీ
కొందరు కార్పొరేటర్ల దందాలు, దౌర్జన్యాలు నిత్యకృత్యంగా మారగా.. ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. బాధితులు చేసిన ఫిర్యాదు వాస్తవమైతే చాలు పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. భూ దందాలకు సంబంధించిన ఫిర్యాదులపై ఇటీవల బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, జక్కుల రవీందర్‌లపై కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో చాలా మంది బాధితులు సీపీని సంప్రదిస్తున్నారు. సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో అత్యధికంగా ఈ తరహా ఫిర్యాదులే వస్తున్నాయి. దీంతో వారి పని పట్టేందుకు సీపీ రంగనాథ్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్‌లను రంగంలోకి దింపినట్లు తెలిసింది.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం
జిల్లా న్యాయమూర్తులు రాధాదేవి, కృష్ణమూర్తి



శిబిరాన్ని ప్రారంభించిన న్యాయమూర్తులు రాధాదేవి, కృష్ణమూర్తి

వరంగల్ లీగల్: క్యాన్సర్ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని జిల్లా న్యాయమూర్తులు రాధాదేవి, కృష్ణమూర్తి సూచించారు. ఫిబ్రవరి 4న అంతర్జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం హనుమకొండ న్యాయ సేవా సదనంలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓమెగా బన్న హాస్పిటల్ వారి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని న్యాయమూర్తులు ప్రారంభించి మాట్లాడారు. ఏడాదికి ఒక్కసారైనా ప్రివెంటివ్ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులు 150 మంది కోర్టు సిబ్బందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ భగీరథ్, ప్రవీణ్‌కుమార్, ఉదయకుమార్, కుమారస్వామి, పారా మెడికల్ సిబ్బంది, న్యాయ సేవా సంస్థ కార్యదర్శులు జె.ఉపేందర్‌రావు, బి.శ్రీనివాస్, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభ
- 10లో
'కార్పొరేట్'లకు కొమ్ముకాస్తున్న మోదీ

ఓరుగల్లు జీవితాంతం గుర్తుంటుంది



హన్మంతును గజమాలతో సత్కరిస్తున్న జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, తహసీల్దార్లు

- ఉద్యోగుల సహకారం మరువలేనిది
- బదిలీపై వెళ్తున్న కలెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు

హన్మకొండ అర్బన్: 'ఓరుగల్లు జీవితాంతం గుర్తుంటుంది. ఇక్కడ పని చేసిన మూడేళ్లలో ప్రతీ సంఘటన ఓ గొప్ప అనుభూతినిచ్చింది' అని ఉద్వేగంతో గుర్తు చేసుకున్నారు నిజామాబాద్ కలెక్టర్‌గా బదిలీ అయిన రాజీవ్‌గాంధీ హన్మంతు. శనివారం రాత్రి హనుమకొండ కలెక్టరేట్‌లో రాజీవ్‌గాంధీ హన్మంతుకు జిల్లా అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. అధికారులు, ఉద్యోగులు పూర్తిస్థాయిలో సహకరించడంతోనే రాష్ట్రస్థాయిలో జిల్లాకు, తనకు మంచి పేరు, గుర్తింపు వచ్చిందన్నారు.

రాజీవ్ మృధుస్వభావి: సీపీ

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మృధుస్వభావి అని, పరిపాలనా దక్షత, సమయస్ఫూర్తి, చతురత, దాతృత్వం, మానవత్వం వంటి అన్ని గుణాలు ఆయనలో ఉన్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ అన్నారు. వరంగల్ కలెక్టర్ గోపి మాట్లాడుతూ.. పరిపాలన, సమస్యల పరిష్కారం విషయంలో రాజీవ్‌గాంధీ హన్మంతు వద్ద ఎంతో నేర్చుకున్నానన్నారు. తహసీల్దార్ ఉమారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత పాటలు పాడి అలరించారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసే వరకు బాణసంచా మోగించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని, డీఆర్ఓ వాసుచంద్ర, ఉద్యోగ సంఘాల నుంచి గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు జగన్మోహన్‌రావు, టీఎన్జీఓస్ అధ్యక్షులు ఆకుల రాజేందర్, పుల్లూరు వేణు, బైరి సోమయ్య, రాజేశ్, ట్రెస్సా అధ్యక్షులు గనిపాక రాజ్‌కుమార్, ఇతర అధికారులు మూడేళ్ల కాలంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. అనంతరం గజమాలతో కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు, మెమొంటోలు అందించి సత్కరించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు విజయ్‌చందర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ సనత్‌కుమార్, ఇతర ఎన్జీఓస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పదేళ్ల సమస్యకు పరిష్కారం చూపిన కలెక్టర్
తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమికి సంబంధించిన సమస్య పరిష్కారానికి ధర్మసాగర్ మండలానికి చెందిన ఓ మాజీ మహిళా నక్సల్ సుమారు పదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతోంది. కాగా.. కలెక్టర్ రాజీవ్‌గాంధీ చొరవతో సమస్య పరిష్కారమై పట్టా పాస్‌బుక్ చేతికి అందింది. దీంతో ఆమె శనివారం కలెక్టరేట్‌లో స్వీట్లు పంచింది. వేదికపై కలెక్టర్‌కు శాలువా కప్పి సత్కరించింది.

శిక్ష పడితే నేరం చేయడానికి భయపడతారు..

సీపీ ఏవీ రంగనాథ్



సమీక్షలో మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: నేరస్తులకు కోర్టులో శిక్ష పడితే మళ్లీ నేరం చేయడానికి భయపడతారని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల న్యాయస్థానాలకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, ఏసీపీలతో వరంగల్ పోలీస్ కమిషనర్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ రంగనాథ్ ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు కేసులు కోర్టులో కొట్టుడు పోవడంపై గల కారణాలను పీపీలతో సమీక్షించారు. నిందితులకు కోర్టులో శిక్ష పడేందుకు పీపీలు, పోలీస్ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీపీ పలు సూచనలు చేశారు. ప్రభుత్వ న్యాయవాదులు, పోలీస్ అధికారులు సంయుక్తంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టడంతోపాటు సాక్ష్యాధారాలను కోర్టు ముందు ఉంచాలని, కోర్టులో నిందితులపై నేరం రుజువై శిక్షపడితే బాధితులకు న్యాయ వ్యవస్థపై, పోలీసులపై నమ్మకం పెరుగుతుందని సీపీ పేర్కొన్నారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ.బారి, ఈస్ట్‌జోన్ డీసీపీ ఎం.కరుణాకర్, ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్ అజయ్, సీసీఆర్‌బీ ఏసీపీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్లు రమేష్, కరుణాకర్, శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీలు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి

మహిళలకు వచ్చే క్యాన్సర్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయాలని సీపీ రంగనాథ్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని లక్ష్మీనరసింహ ఆస్పత్రి ఆధ్వర్యంలో కమిషనరేట్‌లో ఉచిత వైద్య శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారాణి పర్యవేక్షణలో బ్రెస్ట్, గర్భసంచి క్యాన్సర్‌కు సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈస్ట్ జోన్ డీసీపీ కరుణాకర్, ఏసీపీ నాగయ్య, పోలీస్ సంక్షేమ ఆర్ఐ నగేష్, డాక్టర్ విద్యారెడ్డి, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి శోభన్ పాల్గొన్నారు.

కొండా చూపు.. తూర్పు వైపు

- వరంగల్ తూర్పు నుంచి పోటీపై స్పష్టత
- పాదయాత్రతోనే కొండా సురేఖ రీ ఎంట్రీ
- కొండా రాకతో ఈస్ట్‌లో మారనున్న రాజకీయం
- ఇప్పటికే జనాల్లో ఎమ్మెల్యే నరేందర్
- మరోవైపు బీజేపీని క్షేత్రస్థాయిలో బలపర్చడంపై 'ఎర్రబెల్లి' ఫోకస్
- ఈసారి త్రిముఖ పోరు!



సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పొలిటికల్ హీట్ పెరుగుతోంది. ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత కొండా సురేఖ తూర్పు నుంచి బరిలోకి దిగుతారని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాజకీయ సమీకరణలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2014లో వరంగల్ తూర్పు నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కొండా సురేఖ గెలిచారు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ విడుదల చేసిన తొలి జాబితాలో ఆమె పేరు లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి మారారు. పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత వరంగల్ తూర్పులో యాక్టివ్‌గా లేకపోయినా.. కాంగ్రెస్ పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో అడపాదడపా పాల్గొన్నారు. దీంతో ఇన్నాళ్లూ.. కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపించే ముఖ్య నాయకుడు వరంగల్ తూర్పులో లేకపోవడంతో హస్తం శ్రేణులు ఉన్నామా.. అంటే ఉన్నాం.. అన్నట్లుగా పార్టీకి సంబంధించిన వివిధ కార్యక్రమాలు చేస్తూ వచ్చారు.

శ్రేణుల్లో జోష్

కొండా కుటుంబం నుంచి ఒక్కరే పోటీ చేస్తారని, అది కూడా కొండా సురేఖ గతంలో పోటీ చేసి గెలిచిన వరంగల్ తూర్పు నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉంటారని స్పష్టమైన ప్రకటన రావడంతో.. హస్తం శ్రేణుల్లో జోష్ పెరిగింది. బీసీ ఓటర్లు అత్యధికంగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ద్వారా తమ సామాజిక ఓట్లను రాబట్టుకోవడంతోపాటు కాంగ్రెస్ పార్టీకి ఉన్న సంప్రదాయక ఓట్లు అనుకూలంగా మలుచుకుంటే విజయఢంకా మోగించవచ్చన్న ధీమాలో ఉన్నారు. అయితే ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కూడా బీసీ సామాజిక వర్గం కావడంతోపాటు బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు తనకు కలిసొస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. ఇప్పటికే వివిధ కార్యక్రమాలతో జనాలను కలుస్తూ పాజిటివ్ వైబ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు టీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లి బీజేపీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటూ క్షేత్రస్థాయిలో తిరుగుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు వచ్చే ఎన్నికలకు గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. గతంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసిన సమయంలో, టీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో అన్ని డివిజన్ల నేతలతో ఆయనకు సత్సంబంధాలున్నాయి. ఇలా.. ముగ్గురు నేతలు ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన వారు కావడంతో ఈ దఫా త్రిముఖ పోరు ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రసవత్తరంగా రాజకీయాలు

ఈనెల తొమ్మిది నుంచి వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గడప గడపకూ పాదయాత్రతో మళ్లీ ప్రజల నుంచి కొండంత అభిమానాన్ని దక్కించుకోవాలని కొండా సురేఖ ప్రణాళిక రచించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టనున్న 'హాథ్ సే హాథ్ జోడో' పాదయాత్రకు మద్దతుగా తూర్పులో పాదయాత్ర చేస్తామని కొండా మురళి ప్రకటించడంతో తూర్పులో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇన్నాళ్లూ అధికార పార్టీ వైఫల్యాలను ఎత్తిచూపే నాయకులు పెద్దగా కాంగ్రెస్‌లో లేకపోవడంతో హస్తం డీలా పడింది. తూర్పు నియోజకవర్గం అణువణువునా తెలిసిన కొండా సురేఖ పాదయాత్ర ద్వారా అన్ని వర్గాల మద్దతు కూడగడుతూనే ప్రజా సమస్యల్ని ఎత్తిచూపేలా వ్యూహాలు రచిస్తున్నారు. ఇంకో వైపు ఇతర పార్టీల నుంచి చేరికలుంటాయని కొండా అనుయాయులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో తూర్పులో రాజకీయ వేడి మొదలైందన్న చర్చ జరుగుతోంది. ఇంకోవైపు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కూడా జనహిత కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇతర పార్టీ నేతలను గులాబీ పార్టీలో చేరుస్తూ అభివృద్ధి నినాదంతో ఇప్పటికే జనాల్లో తిరుగుతున్నారు. ఇక బీజేపీ కూడా ఈసీటుపై గురిపెట్టడంతో బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ మార్గదర్శకాల ప్రకారం కమలనాథులు ఏకతాటిపైకి వచ్చి పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. దాదాపు ఎర్రబెల్లి ప్రదీప్‌రావుకే టికెట్ అవకాశాలు ఉండడంతో ఆయన జనాలతో మమేకమవుతున్నారు. పార్టీలో సభ్యత్వాలు పెంచుతూ ముందుకెళ్తున్నారు. ఈ ముగ్గురు నియోజకవర్గంతో అనుబంధం ఉన్నవాళ్లే కావడంతో వచ్చే ఎన్నికలు రాజకీయాలు రసవత్తరంగా ఉండే అవకాశం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.



సల్లంగ సూడు తల్లీ.. మళ్లొస్తం - 8లో
ముగిసిన మినీ మేడారం జాతర

మండమెలిగె వేడుకతో మొదలైన మినీ మేడారం జాతర శనివారం ఘనంగా ముగిసింది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో మేడారం పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. భక్తులు ఎత్తుబంగారం, ఎదురుకోడి, తలనీలాలు సమర్పించి తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగురోజులు చెట్ల కింద విడిది చేసిన భక్తులు సల్లంగ సూడు తల్లీ మళ్లొస్తాం అంటూ తిరుగు ప్రయాణమయ్యారు. - ఎస్ఎస్ తాడ్వాయి

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఎంజీఎం: క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించినట్లయితే నివారించడానికి వీలవుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ ఆఫీసు నుంచి పెద్దమ్మగడ్డ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో బీపీ, షుగర్‌తోపాటు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకుబ్‌పాషా, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమ పాల్గొన్నారు.

ఆత్మహత్య

కాజీపేట రూరల్: కాజీపేట –కోమటిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గల వడ్డెపల్లి చెరువు సమీపంలో రైల్వే ట్రాక్‌పై శనివారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ దయాసాగర్ వివరాల ప్రకారం.. కి.మీ. నంబర్ 363/10–12 మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని సుమారు 30 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రెండు ముక్కలుగా పడి ఉన్నాడు. మృతుని కుడిచేతిపై అమ్మ, ఎడమ చేతిపై పీఆర్ అని పచ్చబొట్టు రాసి ఉందని, ఎరుపు రంగు షర్టు, నీలం రంగు జీన్స్‌ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

తల్లులారా.. మళ్లొస్తాం

ముగిసిన మినీ మేడారం



- నాలుగు రోజుల పాటు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన గద్దెల ప్రాంగణాలు

ఎస్‌ఎస్ తాడ్వాయి: మినీ మేడారం జాతర ఘనంగా ముగిసింది. నాలుగు రోజుల పాటు భక్తులు వన దేవతలకు తీరుబడిగా మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడాయి. జంపన్నవాగు మొదలు గద్దెల వరకు, అక్కడి నుంచి చిలకలగుట్ట వరకు వాహనాలతో నిండిపోయింది. మినీ జాతర (మండమెలిగె పండుగ)తో నాలుగు రోజుల పాటు మేడారం భక్తులతో కళకలాడింది.

నాలుగు రోజులు ఘనంగా..

బుధవారం మండమెలిగే వేడుకతో మొదలైన మినీ మేడారం జాతర శనివారం వరకు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం జరిగింది. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. వీటికి అదనంగా స్వంత వాహనాల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి బారులుదీరారు. జంపన్నవాగు స్నానఘట్టాల్లో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. మేడారం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరావు, జంపన్న వసతి సముదాయాలు భక్తులతో నిండిపోయాయి. ఇవి కాకుండా రెడ్డిగూడెం, ఇంగ్లిష్ మీడియం స్కూల్ పరిసర ప్రాంతాల్లోనూ భక్తులు బస చేశారు.



క్యూలో భక్తుల సందడి

కొనసాగుతున్న భక్తుల రాక

బుధవారం మొదలైన జాతర శనివారంతో ముగిసినప్పటికీ ఆదివారం మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని వన దేవతలను దర్శనం చేసుకునేందుకు భక్తులు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా పౌర్ణమి, వీకెండ్ కలసి రావడంతో హైదరాబాద్ నుంచి వివిధ ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో మేడారానికి చేరుకుంటున్నారు. దీంతో మినీ జాతర ముగిసినా మేడారంలో భక్తుల కోలాహలం తగ్గలేదు.

తనివితీరా మొక్కులు

కరోనా కారణంగా చాలా మంది భక్తులు గత జాతర సందర్భంగా మేడారం వచ్చేందుకు సంశయించారు. ప్రస్తుతం కరోనా భయం తగ్గిపోవడంతో మినీ మేడారం జాతరకు ఈసారి భక్తులు పోటెత్తారు. వన దేవతలకు తనివితీరా మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణంలో నిలువెత్తు బంగారం, ఒడి బియ్యం సమర్పించారు. యాటలు, కోళ్లను తల్లులకు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

తిరుగువారం పండుగ

మేడారం మినీ జాతర ముగిసిన తర్వాత ఈనెల 8వ తేదీన (బుధవారం) సమ్మక్క సారలమ్మ పూజారులు తిరుగువారం పండుగ నిర్వహించనున్నారు. మేడారంలోని సమ్మక్క గుడిలో, కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో పూజారులు తిరుగువారం పండుగ పూజలు చేస్తారు. అమ్మవార్ల ఆలయాలను శుద్ధి చేసి దూపాదీపాలు వెలిగించి యాటలను మొక్కుగా సమర్పిస్తారు. తిరుగువారం పండుగతో పూజలు పరిసమాప్తం కానున్నాయి.

పకడ్బందీ ఏర్పాట్లు

మినీ జాతరకు జిల్లా యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేసింది. దేవాదాయ, మెడికల్, ఐసీడీఎస్, ఐటీడీఏ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో సిబ్బందికి జాతర విధులు అప్పగించారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ కంట్రోల్ బాధ్యతల్లో నాలుగు వందల మందికి పైగా పోలీసులు పాల్గొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం జిల్లా నుంచే కాకుండా ఆంధ్ర నుంచి కూడా కార్మికులను రప్పించారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు





ఎత్తు బంగారం(బెల్లం)తో తరలివస్తున్న భక్తులు

పారిశుద్ధ్య సేవలు భేష్



పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో డీపీఓ వెంకయ్య పర్యవేక్షణలో జాతరలో పారిశుద్ధ్య కార్మికులు ఎక్కడా లోపాలు తల్లెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సేకరించిన చెత్తచెదారాన్ని డంపింగ్ యార్డులకు తరలించారు. జాతరలో కార్మికులు అందించిన పారిశుద్ధ్య సేవలను భక్తులు, అధికారులు మెచ్చుకున్నారు. మినీ జాతర ముగిసిన మరో వారం రోజుల పాటు పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటామని డీపీఓ వెంకయ్య తెలిపారు. అంతేకాకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతరలో మూడు శిబిరాల ద్వారా తప్పిపోయిన భక్తులను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వెలవెలబోయిన 'హరిత'

మినీ జాతరకు వచ్చిన భక్తులతో మేడారం పరిసర ప్రాంతాలు కళకళలాడితే కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన హరితా హోటల్ వెలవెలబోయి కన్పించడం గమనార్హం. గదుల ధర అధికంగా ఉండటం, నిర్వహణ లోపాలు, సరైన ప్రచారం లేకపోవడంతో హరిత ప్రాంగణం వెలవెలబోయింది. కనీసం క్యాంటీన్‌లో సైతం జన సందడి కనిపించలేదదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మినీ జాతరను పురస్కరించుకుని ఇక్కడ నిర్మించిన అంఫీ థియేటర్‌లో ఏమైనా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే బాగుండేదని భక్తులు అభిప్రాయపడ్డారు. కాగా, గిరిజన మ్యూజియం భక్తుల సందర్శనతో సందడిగా మారింది.

సమన్వయంతో జాతర విజయవంతం



సమ్మక్క– సారలమ్మ మినీ జాతర విజయవంతమైంది. అధికారుల సమన్వయంతోనే ఇది సాధ్యమైంది. మినీ జాతరలో సేవలందించిన జిల్లా అధికారయంత్రానికి ప్రత్యేక కృతజ్ఞతలు. నేడు (ఆదివారం) మాఘశుద్ధ పౌర్ణమి రోజు కావడంతో భక్తులు భారీగా తరలి రానున్నారు.

– సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

ఏ ముఖం పెట్టుకుని పాదయాత్ర చేస్తవ్..

- రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన రెడ్ కో చైర్మన్ సతీష్‌రెడ్డి
- ములుగులో 6న రేవంత్‌రెడ్డి యాత్ర ప్రారంభం

హన్మకొండ: ములుగు నుంచి పాదయాత్ర చేయాలనుకుంటున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి.. ఇక్కడి ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని రెడ్‌కో చైర్మన్ వై.సతీష్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీగా ఏనాడైనా జిల్లా అభివృద్ధిపై పార్లమెంట్‌లో మాట్లాడినవా..? ములుగుకు ప్రత్యేకంగా ఏమైనా నిధులు అడిగినవా..? పదేళ్ల రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మేడారానికి జాతీయ హోదా ఎందుకు ఇయ్యలేదు..? ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని పాదయాత్ర చేస్తావని ఆయన ఒక ప్రకటనలో తూర్పారబట్టారు. రామప్ప అభివృద్ధి, ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఎనాడైనా కేంద్రాన్ని నిలదీశావా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే సీతక్క రామప్ప అభివృద్ధి విషయంలో జరుగుతున్న అన్యాయంపై, మేడారం పండుగకు జాతీయ హోదా, గిరిజన యూనివర్సిటీపై రాహుల్ గాంధీతో పార్లమెంట్‌లో ఎందుకు అడిగించలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిది ఐరన్ లెగ్ అని సీతక్క గ్రహించాలని సూచించారు.

అమెరికా వెళ్లేందుకు.. ఆస్తి తీసుకున్నాడు

- గిరిజనుల భూమి బదలాయించుకున్న వైనం

రఘునాథపల్లి: అమెరికా వెళ్లేందుకు ప్రాపర్టీ కోసం గిరిజనుల వ్యవసాయ భూమి బదలాయించుకొని, తిరిగి రిజిస్ట్రేషన్ చేయక పోగా, మరొకరికి విక్రయించి సదరు వ్యక్తికి భూమి చూపకుండా మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వీరేందర్ శనివారం తెలిపారు. జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ గ్రామానికి చెందిన అనుమాండ్ల కిరణ్‌కుమార్‌రెడ్డి అమెరికా వెళ్లేందుకు ప్రాపర్టీ అవసరం కాగా, మండలగూడెం పరిధిలోని పోతరాజుతండాకు చెందిన గిరిజనులను నమ్మించి ఐదు ఎకరాల వ్యవసాయ భూమి తన పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఒప్పందం ప్రకారం ఆరు నెలలకు తిరిగి వారి భూములు వారికే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా దుర్బుద్ధితో హైదరాబాద్‌కు చెందిన మల్లికార్జున్ అనే వ్యక్తికి అట్టి భూములు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశాడు. కొనుగోలు చేసిన మల్లికార్జున్‌కు భూములు చూపకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కిరణ్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఇదే కేసులో గిరిజనులను నమ్మించి వారి భూములు రిజిస్ట్రేషన్ చేసుకొని తిరిగి బదలాయించకుండా ఇతరులకు విక్రయించాడని బాధిత గిరిజనుల ఫిర్యాదు మేరకు రెండు నెలల క్రితం కిరణ్‌కుమార్‌రెడ్డిపై మరో రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం..

హసన్‌పర్తి: హనుమకొండ నగరంలోని పెగడపల్లి డబ్బాల ప్రాంతంలో సుమారు రూ.26వేలు విలువగల గంజాయిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శనివారం పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, ఓ బైక్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.14,200 స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన సాంబరాజు హేమంత్, జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం సూరంపేట వాసి మంతిని శ్రీనివాస్‌లు ఓ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ అభ్యసిస్తున్నాడు. కోడిమ్యాలకు చెందిన మల్లేశం వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నారు. కాగా, పెగడపల్లి డబ్బాల వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి ఆ ధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మల్లేశం పరా రీలో ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ తెలిపారు. ఈ దాడుల్లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై లవన్‌కుమార్, నిశార్ పాల్గొన్నారు.

వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో..

రామన్నపేట: వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం ఒకరి నుంచి 500 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఎస్సై శివకుమార్, కానిస్టేబుల్లు భిక్షపతి, శశికుమార్‌లతో కలిసి తనిఖీలు నిర్వహించగా ఓ యువకుడు చేతిలో కవర్ పట్టుకుని అనుమానా స్పదంగా కనిపిస్తూ తప్పించుకునే ప్రయత్నం చేయగా పట్టుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద రూ.10వేల విలువ చేసే గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. దీంతో అతడిని విచారించగా గోవిందరాజుల గుట్ట ప్రాంతానికి చెందిన ఎండీ అజార్ అని తెలిసి ఒదని తెలిపారు. అజార్ ఏడాది కాలంగా రైల్వే స్టేషన్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడని వెల్లడించారు. దీంతో అజార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ మల్లేష్ తెలిపారు.

నియామకం



రవికృష్ణ గౌడ్

హన్మకొండ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రవి కృష్ణను నియమించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న హనుమకొండలోని వడ్డేపల్లికి చెందిన బైరి రవికృష్ణను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బైరి రవికృష్ణ మాట్లాడారు. పది సంవత్సరాలుగా వివిధ హోదాల్లో బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తనను నియమించిన జాజుల శ్రీనివాస్ గౌడ్‌తోపాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.

పాలన చేతకాకుంటే పారిపోవాలి..

- బీఆర్‌ఎస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి..
- వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

పర్వతగిరి/సంగెం: మీకు దమ్ము, ధైర్యం ఉంటే మంచి పాలన అందించాలని, పాలన చేతకాకపోతే వదిలి పారిపోవాలని వైఎస్సార్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ప్రజా ప్రస్థానం పాదయాత్ర సందర్భంగా శనివారం మండలంలోని చౌటపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పర్వతగిరి మండలంలో పాదయాత్ర సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు వైఎస్సార్ టీపీ ఫ్లెక్సీలను చించివేయడం, ఇటీవల జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్ నాయకులకు చాలెంజ్ విసురుతున్నానని, మీ దాడులకు వైఎస్సార్ బిడ్డ భయపడదన్నారు. మేము చేస్తున్న ఆరోపణల్లో తప్పులు ఉంటే పబ్లిక్ ఫోరం పెట్టాలని, మీడియా, ప్రతిపక్షాలను పిలిపిద్దామా.. అంటూ సవాల్ విసిరారు. అధికారం ఉంది కదా, పోలీసులు ఉన్నారు కదా.. అని దాడులు చేస్తే ఊరుకోమని, మా జోలికొస్తే ఇంకా గట్టిగా మాట్లాడుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉండాలని హితవుపలికారు. రాష్ట్రంలో ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యేలు ఎవరూ లేరన్నారు.



కొంకపాకలో పాదయాత్ర చేస్తున్న షర్మిల

ఎమ్మెల్యే అరూరి రమేష్ భూకబ్జాలు వాస్తవాలు కాదా.. అని, ఆయనపై చేసిన ఆరోపణలు ప్రజలు చెప్పినవేనన్నారు. భూములు ఇవ్వకపోతే థర్డ్ డిగ్రీలు ప్రయోగించడం వాస్తవం కాదా.. అంటూ ప్రశ్నించారు. స్వయంగా మంద కృష్ణ మాదిగ భూములు కూడా ఎమ్మెల్యే అరూరి కబ్జా చేయాలనుకోవడం వాస్తవం కాదా.. అని నిలదీశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు సర్పంచ్‌ల పక్షాన ఏరోజైనా నిలబడ్డారా.. అనే విషయాన్ని తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు నాడెం శాంతికుమార్, మల్లేశంగౌడ్, అప్పం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: వరంగల్ మహానగరం నక్కలపెల్లిలో ఆదివారం ఉదయం 9గంటలకు వైఎస్ఆర్‌టీపీ అధినేత వైఎస్ షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్ర ప్రారంభమవుతుందని రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి శనివారం తెలిపారు.

సర్టిఫికెట్లు, సర్వీస్ బుక్స్ పరిశీలన

విద్యారణ్యపురి: బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ బుక్స్ పరిశీలన కార్యక్రమం డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎండి.అబ్దుల్ హై పర్యవేక్షణలో శనివారం చేపట్టారు. జిల్లావ్యాప్తంగా ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లు, పీఎస్ హెచ్‌ఎంలు, పీఈటీలు, గ్రేడ్–2 హెడ్మాస్టర్ కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో 692 మంది దరఖాస్తు చేశారు. ఇందుకోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల, సర్వీస్ బుక్‌ల పరిశీలనకు పలు కౌంటర్లు ఏర్పాటు చేసి.. పీజీ హెచ్‌ఎంలతోపాటు డీఈఓ కార్యాలయ సిబ్బంది పరిశీలన చేశారు. దీంతో వందలాది మంది ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయానికి రావడంతో సందడిగా మారింది. పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ పెండెం రాజు, టీపీఆర్‌టీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య వివిధ ఉపాధ్యాయుల సమస్యలను సందేహాలను డీఈఓ అబ్దుల్ హై దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన నివృత్తి చేశారు. పీహెచ్‌సీ కేటగిరీ టీచర్లను తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్లు తీసుకురావాలని కోరారు. కొందరు మెడికల్ బోర్డు సర్టిఫికెట్లతోనే వచ్చారని సమాచారం. కాగా.. శనివారం తెలంగాణ రాష్ట్ర అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయలక్ష్మీబాయి అబ్జర్వర్‌గా డీఈఓ కార్యాలయాన్ని సందర్శించారు. డీఈఓ అబ్దుల్ హైతో కొంతసేపు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ గురించి మాట్లాడి.. పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, సీనియారిటీ జాబితాలు, ఎన్ని వేకెన్సీలు తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన డేటాను ఆన్‌లైన్‌లో కనఫర్మ్ చేయాలని అబ్జర్వర్ విజయలక్ష్మి సూచించారని డీఈఓ తెలిపారు.



సర్వీస్ బుక్స్, సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన ఉపాధ్యాయులు

8వ తేదీలోగా సదరం సర్టిఫికెట్లు సమర్పించాలి

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా అంగవైకల్యం, వినికిడి, దృష్టిలోపం, మానసిక వైకల్యం అభ్యర్థులు(టీచర్లు) మెడికల్ బోర్డు సర్టిఫికెట్ కలిగి ఉండి.. సదరం సర్టిఫికెట్‌లేని వారు సందరం క్యాంపునకు వరంగల్ ఎంజీఎంలో ఈనెల 8వ తేదీలోగా హాజరై సర్టిఫికెట్‌ను సమర్పించాలని డీఈఓ అబ్దుల్ హై ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 8లోగా పీహెచ్‌సీ కేటగిరీ టీచర్లు తమ సదరం సర్టిఫికెట్‌ను డీఈఓ కార్యాలయంలో సమర్పించకపోతే సాధారణ టీచర్లుగానే పరిగణిస్తారని ఆయన తెలిపారు.